జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 10-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 306 పేజీలు: 4 వెల : రూ.7



# ఇసుక వ్యాపారంపై..
# గూండాల జోరు

* ఇసుక రవాణాలో కొత్త మాఫియా రాజ్యం
* విశాఖపట్నం-శ్రీకాకుళం మధ్య వ్యాపారులపై గూండాగిరి
* అధికార యంత్రాంగం మౌనం
* ఆనందపురంలో లారీలు అడ్డుకుని డ్రైవర్లపై దాడి
* మా అనుమతి లేకుండా రవాణా చేస్తే కాల్చేస్తామని బెదిరింపులు
* రాత్రివేళ లారీల కబ్జా
* అధికారుల స్పందన శూన్యం

**శ్రీకాకుళం/విశాఖపట్నం, ఏప్రిల్ 9 (వార్త):** శ్రీకాకుళం నుండి ఇసుక రవాణా చేస్తూ విశాఖపట్నంకు వెళ్తున్న లారీ వ్యాపారులపై ఓ యూనియన్ పేరుతో గూండా మూకలు దాడికి దిగిన దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి ఆనందపురం సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఆరు లారీలను అడ్డుకుని, డ్రైవర్లను బెదిరించి, లారీల తాళాలు లాక్కొని భయపెట్టారు. "ఇక్కడ మా యూనియన్‌కి చెప్పకుండా ఒక్క లారీ కూడా తిరగదు. తిరిగితే లారీతో పాటు నిన్నూ కాల్చేస్తాం" అంటూ గట్టిగా హెచ్చరించినట్లు బాధితులు వెల్లడించారు. నమి మాధవరావు అలియాస్ అయ్యప్ప అనే వ్యక్తి అధ్యక్షుడిగా, బొట్టు సురేష్ అనే వ్యక్తి సెక్రటరీగా యూనియన్‌కి చెందిన కొందరు ఈ దాడులకు పాల్పడ్డారని వాపోతున్నారు. దాడిలో పాల్గొన్న వారు తమ వద్ద ఉన్న రాడ్లు, దండాలతో డ్రైవర్లను బెదిరించారని, మానసికంగా హింసించారని తెలిపారు. "రాత్రి మొత్తం లారీలను వాళ్ల వద్దే నిలిపేసి, మా దగ్గర ఫోన్‌లు కూడా తీసేసారు. మమ్మ ల్ని ఏం చేసినా ఎవ్వరికీ తెలియదన్న భయం చూపించారు" అని ఓ డ్రైవర్ చెప్పాడు.

## ఇన్స్పెక్టర్లు ఇన్‌యాక్టివ్..

బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని ఆరోపిస్తున్నారు. "అన్నా-మా లారీలను లాక్ చేసేశారు. డ్రైవర్లను బెదిరిస్తున్నారు. అయినా పోలీసులు వచ్చి పట్టించు కోవడం లేదు" అని బాధితుల వాపోయారు. ఇదే సందర్భంలో విశాఖ సీపీకి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా కార్యాలయా నికి వెళ్లిన వారిని లోపలకి కూడా అనుమతించలేదని తెలిపారు.

## 'వ్యాపారం చేస్తే తప్పా?"


బాధితుల కథనం ప్రకారం.. తాము ప్రభుత్వ అనుమతులతో లారీ వ్యాపారం చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నామని, కానీ కొంతమంది యూనియన్ పేరుతో మాఫియా శైలిలో వ్యవహరిస్తు న్నారని అంటున్నారు. "తినే భోజనానికి కష్టపడి సంపాదిస్తున్న మాకే ఇవి కావాల్సిన కష్టాలా? ఇది గూండా రాజ్యమా?" అని ఓ వ్యాపారి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వ్యవహారంపై సంబంధిత శాఖలు, పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని బాధితులు కోరుతున్నారు. "ఇదేదైనా రౌడీ గ్యాంగ్ హవా అయితే... న్యాయం ఎక్కడ? వ్యాపారం చేయడం నేరమా?" అని ప్రశ్నిస్తున్నారు.

## శ్రీకాకుళం నుంచి వెళ్తున్న లారీలను అడ్డుకోవడం ఎంత వరకు న్యాయసమ్మతం?

విశాఖపట్నం అవసరాల నిమిత్తం ప్రతిరోజూ 200కి పైగా లారీలు శ్రీకాకుళం నుంచి వెళ్తున్నాయి. వాటిలో ఎక్కువ శాతం విశాఖ జిల్లాకు చెందినవే. కేవలం 20-30 వాహనాలు మాత్రమే శ్రీకాకుళం జిల్లాకు చెందినవిగా ఉన్నాయి. ఇవే తమకు పోటీగా మారాయని భావిస్తూ కొందరు గూండాలు దాడులకు పాల్పడు తున్నారు.

## శ్రీకాకుళం వ్యాపారులు స్పందిస్తే ఏం జరుగుతుంది?

ఇలాగే కొనసాగితే శ్రీకాకుళం వ్యాపారులు కూడా కన్నెర్ర చేసి విశాఖ నుంచి వచ్చే వాహనాలను అడ్డుకుంటే? రెండు జిల్లాల మధ్య వ్యాపార సంబంధాలపై పెద్దదెబ్బ పడే ప్రమాదం ఉంది. అధికార యంత్రాంగం ఇప్పుడే స్పందించకపోతే... రేపు ఇది ప్రాంతీయ ద్వేషానికి దారితీయొచ్చు.




## శ్రీకాకుళం-విశాఖ మధ్య సాగుతున్న "టోల్‌ఫ్రీ దందా"

విశాఖకు ఇసుక రవాణా చేస్తున్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన లారీలు ఇటీవల ఓ సంస్థాగత ముఠా బారిన పడుతున్నాయి. 'ఇక్కడ ట్రాన్స్‌ఫర్ చేస్తే మా ఖర్చు కట్టాల్సిందే' అంటూ బెదిరింపులకు దిగుతున్న వారు, ఒక్కో లారీ నుంచి 5,000-6,500 వరకూ ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేసి వదులుతున్నట్లు బాధితుల వాంగ్మూలాల ద్వారా స్పష్టం అయింది. ఈ లావాదేవీలకు సంబంధించిన స్క్రీన్‌షాట్లు ఇప్పటికే బయటకు వచ్చాయి. ముందుగా లారీ ఆపేస్తారు, తర్వాత చర్చ లేకుండా డబ్బు అడుగుతారు. "ఇవ్వకపోతే మట్టిలో కలిపేస్తాం" అనే రీతిలో బెదిరింపులు చేస్తున్నారు. వాహనాల డ్రైవర్లు భయంతో డబ్బులు చెల్లించి బయటపడు తున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

* విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు * నేర నియంత్రణకు డ్రోన్ల వినియోగం * చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఉండాలి * ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్న పోలీసు వ్యవస్థ * మహిళల భద్రతే.. మొదటి ప్రాధాన్యత * రాష్ట్ర హోం మంత్రి అనిత * పోలీసు అధికారులతో సమీక్ష

# జిల్లాకో సైబర్ క్రైం స్టేషన్

**శ్రీకాకుళం ఏప్రిల్ 9 (వార్త):** మహిళలు, బాలికలు భద్రతకు మొదట ప్రాధాన్యత ఇస్తూ, జరుగుతున్న అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని విశాఖపట్నం రేంజ్ పరిధిలో గల పోలీస్ అధికారులను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. రాష్ట్ర హోం మంత్రి అనిత శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ముందుగా పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విశాఖపట్నం రేంజ్ డీఐజి గోపినాథ్ జట్టి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకిత సురానలు హోంమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయం సమీక్ష సమావేశ మందిరంలో విశాఖపట్నం రేంజ్ పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతిపురం మన్యం జిల్లాల పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ పోలీసు ప్రతిష్ట పెంచేలా పనిచేయాలన్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు దశల వారీగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పోలీసు వాహనాలు, ఫింగర్ ప్రింట్ పరికరాలు, సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శక్తి బృందాలు ద్వారా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులు నిర్వహించాలని, ప్రత్యేక కార్యాచరణతో డ్రాప్ బాక్సలను ఏర్పాటు చేయించాలన్నారు. ప్రతి జిల్లాకు ప్రత్యేక ఒక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు వద్ద నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. విద్యాలయాలు, గృహ సముదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలు ఫిర్యాదుదారులు పట్ల పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. నేర నియంత్రణలో సాంకేతికతను, సిసి కెమెరాలను, డ్రోన్స్ వినియోగించాలన్నారు. అనంతరం హోం మంత్రి మీడియాతో మాట్లాడారు. గడిచిన తొమ్మిది నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తి స్థాయిలో అదుపులో ఉన్నాయన్నారు. పోక్సో కేసులలో కఠినంగా వ్యవహరిస్తున్నామని, విజయనగరం జిల్లాలో నమోదైన 20 కేసుల్లో నిందితులు బెయిల్‌పై బయటకు రాకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఇప్పటికి నాలుగు కోట్ల మేరకు కేసుల ప్రాపర్టీని ఛేదించామన్నారు. పాడేరు, మన్యం వంటి చోట్ల గంజాయి సాగుని నివారించామని, గంజాయి క్రయ, విక్రయాలు అక్రమ రవాణా చేసిన వారితో పాటు వ్యవసాయం చేసిన వారి మీద కూడా కేసులు నమోదు చేశామన్నారు. గంజాయిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ఈగల్ టీంలను ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మాదకద్రవ్యాల కేసులలో మూలాలు కనుక్కొని, ఆస్తులు జప్తు చేస్తున్నామని తెలిపారు. గంజాయి సాగు చేసిన, స్మగ్లింగ్ చేసిన, కొనుగోలు చేసిన వారిపై పీడీ యాక్ట్ పెడుతున్నామన్నారు. సంకల్పం కార్యక్రమంలో మహిళలు బాలికలు భద్రతతో పాటు, గంజాయి నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు అన్నారు. శక్తి బృందాలు ద్వారా ఆపదలో ఉన్న వ్యక్తుల ఫిర్యాదు మేరకు వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి నైపుణ్యం గల ఔట్సోర్సింగ్ యువతను నియమించి పెండింగ్లో ఉన్న సైబర్ కేసులన్నీ పరిష్కరిస్తామన్నారు. రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ విశాఖపట్నం రేంజ్ పరిధిలో నేర నియంత్రణ చర్యలలో భాగంగా గడిచిన 10 నెలల కాలంలో మహిళాలు, బాలికలు సంబంధించిన నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ కేసులు నమోదు, నేరగాళ్లు నేర ప్రవృత్తి గురించి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తు, నేరాలు అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.





## రచ్చ చేసేందుకే.. జగన్నాటకాలు

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాజీ సీఎం కావడంతో ఆయనకి భద్రత ఇచ్చామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జగన్ కేవలం పులివెందుల ఎమ్మెల్యే మాత్రమేనని చెప్పారు. వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ మాత్రమే ఆయనకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై రచ్చ చేయడానికే నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. సాంకేతిక సమస్యలు ఉన్నాయన్న హెలికాప్టర్ పదినిమిషాల తర్వాత ఎలా గాలిలోకి ఎగిరిందన్నారు. జగన్ పర్యటనలో వైసీపీ నేతలు కావాలని కొత్త డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.

## ధైర్యంగా ఉండండి.. ఆదుకుంటాం

* క్యాన్సర్ పేషెంట్ లతశ్రీకి భరోసా కల్పించిన హోం మంత్రి అనిత

శ్రీకాకుళం నగరంలో నివాసముంటున్న జర్నలిస్టు ఆనంద్ సతీమణి లతశ్రీ కేన్సర్‌తో బాధపడుతోంది. ఇటీవల హోంమంత్రికి వీడియో కాల్ చేసి తమను కలవాలని ఉందని లతశ్రీ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన హోంమంత్రి.. కేన్సర్‌తో బాధపడుతున్న లతశ్రీ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రభుత్వపరంగా వైద్యసహాయం అందించి ఆదుకుంటామని ధైర్యమిచ్చారు. ధైర్యాన్ని మించిన మెడిసన్ లేదన్నారు. ఇద్దరు పిల్లలను బాగా చూసుకోవాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తనకు తెలియజేయాలని ఆదుకుంటామని హోంమంత్రి భరోసా కల్పించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** జిల్లా కలెక్టరు వారి కార్యాలయం దగ్గరలో గల నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ (న్యాక్) ఆధ్వ ర్యంలో నిరుద్యోగ ఎస్సీ యువతీ యువకు లకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్/డిగ్రీ చదివి 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులు.

సుమారు 2 నెలల పాటు శిక్షణ పొందాల్సి ఉంటుందన్నారు. శిక్షణార్థులకు మధ్యాహ్న భోజనం, శిక్షణ అనంతరం వివిధ సంస్థల్లో ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుం టామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7893227705 కు సంప్రదించాలని కోరారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

**-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**కోటబొమ్మాళి, ఏప్రిల్ 9(వార్త):** పర్యాటక రంగానికి పరిశ్రమ హొదాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత రంగాన్ని జిల్లాలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్..లో పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, మార్గ నిర్దేశం చేశారు.

టెక్కలిలో పట్టు మహా దేవ్ కోనేరు, భావనపాడు బీచ్, కొత్తపేట కొండ, వీటితోపాట టెక్కలిలో దివంగత నేత మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరిట నెలకొల్పిన పార్కు అభివృద్ధికి చర్యలు చేపడుతూ సమగ్ర ప్రణా ళికలు రూపొందించాలని ఆదేశించారు. నక్షత్ హొటల్స్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ఆయా ప్రాంతాలను స్వయంగా పరిశీలించి నివేదిక అందజేయాలని ఆదేశించిన మంత్రివర్యులు. ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేయాలని, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఒక మంచి వాతావరణం ఉండే విధంగా గ్రీనరీ, చిన్నారులు ఆడుకునేందుకు పార్కు, వంటివి సదుపాయాలు ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన ప్రాంతాలకు పర్యటనకు వచ్చేవారంతా ఆనందాలను పంచుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సమావేశంలో ఈఈ రమణ,జెఈ మన్మధరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు పాల్గొన్నారు.



# మార్కెట్ తరలింపుపై అపోహలు వద్దు : ఎమ్మెల్యే



**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** తన మాటే శిలా శాసనమని, పెద్దమార్కెట్‌లో వ్యాపారుల జాబితా తయారైతే ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయడానికి ముందుకు వెళతామని ఎమ్మెల్యే గొండు శంకర్ స్పష్టం చేశారు. పెద్ద మార్కెట్ పునర్నిర్మాణ పనుల కోసం ఈ నెల 15 లోగా ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల మార్కెట్‌లో పర్యటించిన సందర్భంగా అధికారులకు ఆదేశించిడంపై వ్యాపారులంతా బుధవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ జాబితా తయారైన తర్వాత అందులో ఉన్న వ్యాపారులందరికీ స్థలాలు కేటాయింపుపై జిల్లా కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాతనే మార్కెట్‌ను తరలిస్తామన్నారు. మార్కెట్ తరలించేలోగా మూడు రకాల ప్లాన్‌లు తయారు చేయిస్తున్నామన్నారు. వీటిని మార్కెట్ వ్యాపారుల ముందు పెట్టి అందులో ఒక్క ప్లాన్‌కు అందరి సూచన మేరకు ఎంపిక చేస్తామన్నారు. భవిష్యత్తు తరలాకు ఉపయోగపడే విధంగా ఒక మోడల్ మార్కెట్‌కు రూపకల్పన చేస్తామన్నారు. కొనుగోలుదారులు, వినియోగదారులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా మార్కెట్‌ను నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి నిర్మాణం చేపడతామన్నారు. అయితే నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరిన తర్వాతనే ముందడుగు వేస్తామన్నారు. పెద్ద మార్కెట్‌లో వ్యాపారులంతా సమావేశమై మార్కెట్‌లో ఉన్న వ్యాపారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. దీన్ని వ్యాపారుల సమక్షంలో చదివి జాబితాలో చేర్చినవారి పేర్లు చదవి ఫైనల్జ్ చేస్తానన్నారు. జాబితా సిద్ధమైన తర్వాతనే మార్కెట్ తరలింపు ప్రక్రియ ముందుకు సాగుతుందన్నారు. పైరవీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా షాపులు కేటాయింపు ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమాలకు అవకాశం ఇవ్వనన్నారు. ఎవరి మాటలూ నమ్మొద్దని, నేరుగా తనని కలిసి మాట్లాడాలని సూచించారు. సమావేశంలో పెద్ద మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు కోరాడ హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# 22 వరకు పౌష్టికాహార మహోత్సవాలు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమాలు ఈ నెల 22 వరకు అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం దమ్మలరెల్లి వీధి, 29వ వార్డు మెర్జింగ్ అంగన్వాడి కేంద్రంలో గూనపాలెం సెక్టార్ సూపర్వైజర్ యోగేశ్వరీ, సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పద్మజ 2సంవత్సరాల లోపు పిల్లలకి పెరుగుదల పర్యవేక్షణ, 1000 డేస్ కేర్ కోసం గర్భిణులకు, బాలింతలకు, పౌష్టికాహారం కోసం వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ పార్వతి, జ్యోతి ఆయాలు శారద, శశి ఆ ఏరియా లబ్ధిదారులు పాల్గొన్నారు.




# డప్పు కళాకారులకు ఐడీ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలి

**పలాస, ఏప్రిల్ 9(వార్త) :** డప్పు కళాకారులకు అర్హులైన అందరికీ గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డప్పు కళాకారుల సంఘం ( కెవిపి ఎస్) నాయకులు తోట సిమ్మయ్య, రుంకు రామారావు, రోకళ్ల తిరుపతి లు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం నుంచి శ్రీనివాస జంక్షన్ వరకు డప్పులుతో ర్యాలీ చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంకినమ్మ గుడి ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాలు ఫలితంగా ప్రభుత్వాలు పింఛన్లు, కార్డులు మంజూరు చేశాయని కానీ ఇంకా అనేకమంది అర్హులు ఉన్నారని తెలిపారు. సాంప్రధాయ కళలకు ప్రోత్సాహం కల్పించాలంటే డప్పు కళాకారులను ఆదుకొని ముందుకు తీసుకు రావాలని కోరారు. కళాకారులందరికి గజ్జెలు, డప్పులు, డ్రమ్ములు సన్నాయి వంటి వాయిధ్యాలు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కారం కోసం కళాకారులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సమస్యలపై ఈ నెల 21 న ఆర్ డి ఓ కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగి జనార్ధన, ఎ నాగేశ్వరావు, సి హెచ్ చరణ్, టి భగీరది, జి హరికృష్ణ, పి శివరాం, జి దాసు, ఆర్ హరికృష్ణ, కె పాపారావు, టి రామారావు, తదితరులు పాల్గొన్నారు.






## లతశ్రీని పరామర్శించిన హెూం మంత్రి అనిత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** శ్రీకాకుళం నగరంలో క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న లతశ్రీని హెూం మంత్రి అనిత ప్రమర్శించారు. 8 ఏళ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న లతశ్రీకి అనిత అంటే అపారమైన అభిమానం. లతశ్రీ చనిపోయే ముందు హెూం మంత్రిని కలవాలన్న తన కోరికను కొంతమంది మంత్రి అనిత దృష్టికి తీసుకువెళ్లారు.దీనిపై స్పందించిన హెూంమంత్రి అనిత ఇటీవల ఆమెతో వీడియో కాల్‌లో మాట్లాడారు. త్వరలో ఇంటికి వచ్చి కలుస్తానని మాటిచ్చారు. ఈ నేపథ్యంలో శ్రీకాకుళం వచ్చిన ఆమె.. ఎమ్మెల్యే గొండు శంకర్ తో కలిసి లతశ్రీ ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని లతశ్రీకి సూచించారు. ఆరోగ్యం మెరుగుపడడానికి ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు.

## సమస్యలను పరిష్కరించే దిశగా గ్రీవెన్స్



**పాతపట్నం, ఏప్రిల్ 9(వార్త):** పాతపట్నం నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నియోజక వర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు,

## ప్రతి ఒక్కరూ నేత్రాలను సంరక్షించుకోవాలి




**మందస, ఏప్రిల్ 9(వార్త):** ప్రతీ ఒక్కరూ నేత్రాలను సంరక్షించుకోవాలని మందస నేత్ర వైద్యాధికారి రోణంకి వెంకటరమణ కోరారు. మందసలోని శ్రీసత్య సాయి మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి(శ్రీకాకుళం), జిల్లా ఆంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఆయన మాట్లాడుతూ కళ్లను ఎంతో జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 42మందికి కంటి పరీక్షలు నిర్వ హించగా, వీరిలో 23మందికి ఆపరేషన్‌కు శ్రీకాకుళం రిఫెర్ చేశారు. శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం కె.అరుణకుమారి, సోమేశ్వరరావు, నేత్ర వైధ్యాధికారి రోణంకి వెంకటరమణ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సత్యసాయి మందిర్ కన్వీనర్ పూనా ఈశ్వరరావు, సేవాదళ్ సభ్యులు రామారావు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వస్త్ర వ్యాపారి మృతి

**-ధర్మపురం గ్రామానికి చెందిన బావిలో మృతదేహం లభ్యం**



**పొందూరు, ఏప్రిల్ 9(వార్త):** పొందూరు గ్రామానికి చెందిన ఉంద్రాళ్ల కిషోర్ అనే వ్యక్తి ధర్మపురం బావిలో పడి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మృతుడు పొందూరు పట్టణానికి చెందిన కిషోర్ చాలా కాలంగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. ఎప్పటికి వలె గ్రామాలకు వెళ్లి బాకీ లు వసూల్ల నిమిత్తం బుధవారం కూడా వెళ్లారు. కానీ తిరిగి రాకుండా ధర్మపురం గ్రామానికి చెందిన బావిలో మృత దేహంగా కనిపించాడు. అక్కడ స్థానికులు గమనించి పొందూరు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసు కున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి మృతుడు పొందూరు కిషోర్ గా గుర్తించి కుటుంబా నికి సమాచారం అందించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టమార్టము నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గురుకులాల ప్రవేశాలకు హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకోవాలి

**మందస, ఏప్రిల్ 9(వార్త):** మందస మండలంలోని రాధాకృష్ణపురం సమీపంలో గల ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో(డా.బి.ఆర్.అంబేద్కర్ గురుకులం) 2025-26 విద్యా సంత్సరానికి ప్రవేశాలకు హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి చెప్పారు. 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కొరకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13వ తేదీ(ఆదివారం) జరుగుతుందన్నారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 5 వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 4.30గంటల వరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను https://apbragcet.apcfss.in వెబ్ సైట్ నుండి పొందగలరని, హాల్ టికెట్, ఏదైనా ఒక గుర్తింపు కార్డు(ఉదా:ఆధార్ కార్డు)తో పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపల్ లక్ష్మి సూచించారు.



## మెరుగైన సేవలందించండి

**పలాస, ఏప్రిల్ 9(వార్త) :** మెరుగైన ఆర్టీసీ సేవలు అందించాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష విజ్ఞప్తి చేశారు. పలాస నియోజకవర్గ సమస్యలపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మర్యాద పూర్వకంగా బుధవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికి చైర్మన్ నారాయణకు విజ్ఞప్తి చేసారు. దూరప్రాంతాలకు పలాస కేంద్రంగా సర్వీసులు పెంచాలని, నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సౌకర్యాలను కల్పించాలని కోరారు, పరీక్షా కాలం అయినందున విద్యార్థులకు అంతరాయం లేని సేవలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఎమ్మెల్యే శిరీషతో ఆమె భర్త నియోజకవర్గ సమన్వయకర్త ప్రముఖ పరిశ్రమకవేత్త వెంకన్న చౌదరి ఉన్నారు.

## సారా తయారీపై ఎక్సైజ్ దాడులు

**-1800లీటర్లు, 75కిలోల నల్లబెల్లం ధ్వంసం -40లీటర్ల సారా సీజ్**



**మందస, ఏప్రిల్ 9(వార్త):** మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన చీపి పంచాయతీలోని పుట్టూరు ప్రాంతంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్శాఖాధికారులు దాడులు నిర్వహించారు.ప్రొహిబిషన్, ఎక్సైజ్ సోంపేట సీఐ కె.బేబీ, పలాస ఎస్ఐ మల్లికార్జునరావు, ఇచ్ఛాపురం ఎన్హెచ్ఎ పీడీ ప్రసాద్, ఏసీ ఎన్ఫోర్స్మెంట్ సీఐ మర్రాపు శ్రీనివాసరావు(శ్రీకాకుళం), మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సోంపేట సీఐ జీవీ రమణ, ఏఈఎస్టీఎఫ్ ఎస్ఐ ఆర్.అప్పారావు(పలాస), ఆయా స్టేషన్ల సిబ్బంది ఏకకాలంలో దాడులు నిర్వహించి, 1800 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 75 కిలోల నల్లబెల్లం కూడా ధ్వంసం చేసి, 40 లీటర్ల సారా సీజ్ చేశారు. సవర సుకుమారిని అరెస్ట్ చేసి, రిమాండ్కు తరలించామని సీఐ బేబీ చెప్పారు. సుకుమారి భర్త గోవిందును సారా తయారీ, అమ్మకం చేస్తున్న వ్యక్తిగా గుర్తించి, ఇన్వాల్వ్ చేయడం జరిగిందన్నారు. సారా తయారీ, అమ్మకాలు, రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్శాఖాధికారులు హెచ్చరించారు.

## అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతి కల్పించాలి



**పలాస, ఏప్రిల్ 9(వార్త):** అర్హులైన వీఆర్ఏలకు వీఆర్ఓలుగా పదోన్నతి కల్పించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాధరావు, జిల్లా కార్యదర్శి కె రమణమూర్తి డిమాండ్ చేశారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో ఎఓ పాపారావుకు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేస్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. నామిని విఆర్ఎలను రెగ్యులర్ విఆర్ఎలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిహెచ్ లక్ష్మణరావు కార్యదర్శి బి తిరుపతి రావు, ఉపాధ్యక్షుడు సిహెచ్ సింహాచలం, వెంకట్రావు, బైరాగి, బానుకుమారి, రేణుకా, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాలలో జనం కోసం 'జనసేన'

**మందస, ఏప్రిల్ 9(వార్త):** మందస మండలంలోని గిరిజన ప్రాంతాల్లో జనం కోసం జనసేన కార్యక్రమం నిర్వహించినట్టు ఆ పార్టీ నాయకులు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మార్గంలో పలాస నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు మందస మండలంలోని కొన్ని గిరిజన గ్రామాలను సందర్శించి పిల్లలకు బట్టలు, స్టేషనరీ, ఆహార పదార్థాలను అందించారు. కార్యక్రమాన్ని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దిలీప్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో జరిగింది. గిరిపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారి జీవితాలను మెరుగుపరచుకోవడానికి అవసరమైన సహాయం చేయడానికి సమీప ప్రాంతాలను కవర్ చేస్తూ కుమ్మరికుటియా గ్రామం నుండి కార్యక్రమం ప్రారంభించారు. జనసేన సీనియర్ నాయకుడు కోన కృష్ణారావు, వజ్రపుకొత్తూరు క్లస్టర్ ఇంచార్జ్ దువ్వాడ వంశీ కృష్ణచౌదరి, జిల్లా సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గం ఐటీ కోఆర్డినేటర్ లావేటి సురేష్, మందస మహేష్ బమ్మిడి కార్యక్రమంలో పాల్గొన్నారు.



## జిల్లాలో బీజేపీ బలోపేతానికి చర్యలు

**-జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వర రావు**




**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** బిజెపి శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంకు చెందిన క్రియాశీల సభ్యుల సమావేశం అసెంబ్లీ కన్వీనరు పైడి వేణుగోపాలం మరియు కార్యక్రమం ఇంఛార్జ్ చల్లా వెంకటేశ్వర రావు అధ్వర్యంలో ఈ రోజు జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వర రావు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో పార్టీ బలోపేతానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, పూర్తి స్థాయిలో సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టామని తెలిపారు.ఎన్నికల్లో బిజెపి విజయం మరియు సంస్థాగత విస్తరణ అనే కాలాంశంపై సిరిపురం తేజేశ్వర రావు, 11 సంవత్సరాలలో వికసిత్ భారత్ దిశగా భారత ప్రధానిగా గౌ. శ్రీ నరేంద్ర మోడి గారి ప్రయాణం అనే కాలాంశంపై పైడి వేణుగోపాలం, భారత రాజకీయాల్లో బిజెపి తెచ్చిన మార్పు అనే కాలాంశంపై డా. పైడి సింధూర వక్తలుగా ప్రసంగించారు.

కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శవ్వాన ఉమామహేశ్వరి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి దుర్గారావు గాంధి, పేడాడ సూర్యకుమారి, సురేష్ బాబు సింగ్, పండి యోగేశ్వర రావు, మండలాధ్యక్షులు కనుగుల లలిత కుమారి, మైలపల్లి లక్ష్మీ జనార్దన రావు, రుప్ప బాలకృష్ణ, చింతాడ భూషణరావు, టేకి మాధవరావు, పూజారి చెల్లయ్య, చౌదరి ధనలక్ష్మి, భైరి అప్పారావు, సురవరపు పద్మ, కద్దాల శ్యామ సుందర రావు, దన్నాన మదన్ మోహనరావు, బలివాడ వెంకట జాహ్నవి, పూడి స్వర్ణలత, సింగుపురపు వెంకట రమణ, సోమేశన్, సరళ, మళ్లపురెడ్డి మనోజ్ కుమార్, వేమూరు ఉమామహేశ్వర రావు, ఆసూరు ఉమామహేశ్వర రావు, కలగదండు అప్పలసూరి, బలివాడ విజయ సారధి, దుండంగి శేషగిరి, ఆరంగి సతీష్ కుమార్, సింగిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు

## నిస్సహాయ వృద్ధుడికి కృత్రిమ అవయవం అందజేత

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** నిస్సహాయ నిరుపేదలకు కృత్రిమ అవయవం ఎవరికి అవసరమున్న ఉచితంగా అందజేస్తామని అరసవల్లికి చెందిన లైన్ కళ్లేపల్లి. ఉష రాణి బుధవారం అన్నారు. అరసవల్లికి చెందిన పట్టా.సత్యం అనే నిరుపేద వయోవృద్ధునికి కృత్రిమ అవయవం రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు చేతుల మీదుగా స్థానిక పిఎన్ కోలనీలో గల వినాయక దేవాలయంలో అందించి మాట్లాడుతూ నిస్సహాయ, నిరుపేదకు ఈ రోజు కృత్రిమ అవయవాన్ని అందించటం సంతోషకరమని, కళ్లేపల్లి ఉషారాణి చొరవతో ఈ మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టటం హర్షణీయమన్నారు. లైన్ క్లబ్ హర్షవల్లి సభ్యురాలైన ఉషారాణి గతంలో కూడా కృత్రిమ అవయవాలను అందించిన విషయం గుర్తు చేశారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా కలక్టర్ సూచనలమేరకు కృత్రిమ అవయవ శిబిరాన్ని నిర్వహిస్తామని అందుకు ఉషారాణి కూడా తమ సహకారం అందిస్తామన్నారు. అనంతరం కళ్లేపల్లి ఉషారాణి మాట్లాడుతూ సాటి వికలాంగురాలిగా అలోచించి పేదలకు కృత్రిమ అవయవాలను సుమారు గత పదిహేను సంవత్సరాలనుండి అందిస్తున్నామని, జిల్లాలో ఎవరికి కృత్రిమ అవయవం కావాలన్నా ఉచితంగా అందిస్తామని, రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్ ఇచ్చిన సమాచారం మేరకు ఈ రోజు పట్టా. సత్యంకు సహాయం చేయగలిగామన్నారు. ఉచితంగా కృత్రిమ అవయవాలను విజయనగరం గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తామని కావలసినవారు మా చరవాణిని సంప్రదించాలన్నారు. వివరాలకు కళ్లేపల్లి ఉషారాణి (8332836356), రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్ (97016 98408) లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో దాత కళ్లేపల్లి ఉషారాణి, ఉర్లం శివతేజ, రెడ్ క్రాస్ ప్రతినిధి నంది ఉమాశంకర్, బాధిత కుటుంబ సభ్యులు, రెడ్క్రాస్ ప్రతినిది ,బృందం, ఆలయ సభ్యులు పాల్గొన్నారు.



## పెంచిన వంట గ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి

**పలాస, ఏప్రిల్ 9 (వార్త):** కేంద్ర బీజేపీ కూటమిప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహనరావు డిమాండ్ చేశారు. గ్యాస్ ధర పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గినందున వినియోగదారులకు గ్యాస్ సిలెండర్ ధరలను తగ్గించాలే తప్ప కేంద్ర బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ సిలెండర్ పై రు.50లు పెంచడం దారుణమన్నారు. గతంలో రూ:400/-లు ఉండే సిలిండర్ ధర రూ:880/-లకు పెరిగిందని దీనివల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు, సాధారణ వినియోగదారులకు పెద్ద భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.




నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర బీజేపీ ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు, సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని కార్పోరేట్ కంపెనీలకు లక్షల కోట్లు రాయితీలిస్తూ, రాష్ట్రంలోని వినియోగదారులపై సంవత్సరానికి రు.400 కోట్ల భారం మోపుతున్నదని అన్నారు.గ్లోబల్ మార్కెట్ లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉందని అన్నారు. పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజు సుంకాన్ని లీటర్ కు రూ:2/-లు చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో తాజా పెంపుతో లీటర్ పెట్రోల్ పై రూ:13/-లు, డీజిల్ పై రూ:10/-లు అమల్లోకి రానుందని అన్నారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇందనాల పై 9సార్లు సుంకాన్ని పెంచిందని దీనతో కేంద్రానికి 99,000 కోట్ల ఆదాయం సమకుర్చుకొందని విమర్శించారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని లేకపోతే ప్రజలు మద్దతుతో పోరాటాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పలాస కార్యదర్శి ఎన్ గణపతి, సిపిఎం సభ్యులు కె సుహాసిని, ఎన్ డిల్లేశ్వరి, తెప్పల అజయ్ కుమార్, కె బాలాజీ, మహాలక్ష్మి, బి శశిరేఖ, ఆటో కార్మికులు జే ఎర్రయ్య, సిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వన్యప్రాణులను సంహరిస్తే చర్యలు

**మందస, ఏప్రిల్ 9(వార్త):** వన్యప్రాణులను వేటాడరాదని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఫారెస్ట్ రేంజ్అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు హెచ్చరించారు. మందస మండలంలోని గిరిజన గ్రామాలైనచీపి, కృష్ణాపురం, పిల్లిబుడారిసింగి తదితర గ్రామాల్లో వన్యప్రాణి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ అడవుల్లోవన్యప్రాణులను స్వేచ్ఛగా తిరగనివ్వాలన్నారు. ఎండాకాలం కావడంతో జనవాసాలకు మూగజీవాలు వస్తుంటాయని, వీటిని ఏమీ చేయకూడదన్నారు. అడవి జంతువుల వేట నేంమని, ప్రస్తుతం చట్టాలు కఠినంగా ఉన్నాయని, ఎవరైనా వేటాడితే అటవీచట్టాలు ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లోకి వస్తున్న జంతువులను కుక్కలు వెంబడిస్తున్నాయని, వాటి నుంచి వన్యప్రాణులను రక్షించాలని కోరారు. గాయపడిన జంతువుల సమాచారం అటవీశాఖకు అందివ్వాలని సూచించారు. డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము మాట్లాడుతూ మందస మండలంతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని అడవుల్లో అడవి జంతువులున్నాయన్నారు. వీటికి ఎటువంటి హాని కలిగించరాదన్నారు. వన్యప్రాణుల వేట నేరమని, తాము ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. వేటగాళ్లుకు చట్టరీత్యా శిక్ష తప్పదన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి ఐ.రాము, ఫారెస్ట్ బీట్ అధికారులు లక్ష్మణమూర్తి, వెంకటేశ్వరరావు, దుర్గాదేవి, సురేష్, భానుమూర్తి, ఆయా గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మెగా డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** మెగా డీఎస్సీ అన్ని సబ్జెక్టులకు ఆన్లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వబడునని శ్రీకాకుళం బి.సి స్టడీ సర్కిల్ వారు తెలియజేశారు. టెట్ (టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్)లో అర్హత సాధించిన శ్రీకాకుళం జిల్లా వాసుల నుంచి బి.సి(%దీజ%) ఓబీసీ కేటగిరికి చెందిన అభ్యర్థుల నుంచి ఈ శిక్షణకు దరఖాస్తులు స్వీకరించబడును. టెట్ మార్కుల ఆధారంగా ఎంపిక చేయబడును. కావున ఆసక్తి గల అభ్యర్థులు సంబందిత ధ్రువపత్రాలతో శ్రీకాకుళం నందు 80 ఫీట్ రోడ్, టిడిపి భవనం వెనుక ఉన్న ఎ.పి బి.సి స్టడీ సర్కిల్, శ్రీకాకుళం కార్యాలయం నందు నేరుగా దరఖాస్తు చేసుకొనవలెను. ఏప్రిల్ 11, 2025వ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్, శ్రీకాకుళం వారు ఒక ప్రకటనలో తెలిపారు.

వివరాల కొరకు ఈ ఫోన్ నెంబర్లు 7382975679, 9295653489 ను సంప్రదించవలసినదిగా సూచించడమైనది.

# ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కారం

**-ఎమ్మెల్యే గొండు శంకర్**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 9(వార్త):** శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజలు వారి సమస్యలను నేరుగా తమ దృష్టికి తెస్తే సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. బుధవారం ఆయన 80 ఫీట్ రోడ్ జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. శ్రీకాకుళం, గార శ్రీకాకుళ పట్టణంలోని ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులు సంప్రదించి సమస్య పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కూటమి ప్రభుత్వములో ప్రజా సమస్యలకే పెద్దపీట వేస్తున్నామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా నిరభ్యంతరంగా వారి సమస్యలను తెలపవచ్చని ఆయన తెలిపారు. సమస్యలు పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు ఈ ప్రజా దర్బార్ కు అధిక సంఖ్యలో ప్రజల వచ్చి సమస్యలపై వినతలు అందజేశారు.

# గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయర్‌గా మార్చాలి



**మందస, ఏప్రిల్ 9(వార్త):** గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయర్ గా మార్చితే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, వడ్డి గోపాలకృష్ణ, గణేష్ సాహు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గోపాలసాగరాన్ని సందర్శించారు. మందస మహేంద్రగిరి నీటిని అంబుగైరి నుండి గోపాలసాగరానికి మళ్లించి, గోపాల సాగరం మినీ రిజర్వాయర్ గా ఏర్పాటు చేయాలన్నారు. మందస మండలంలోని మహేంద్రగిరులు నుండి నిత్యం ప్రవహిస్తున్న నీరు నిరుపయోగంగా సముద్రంలో కలసిపోతున్నదని, ఆ నీటిని సాబకోటకు వద్ద నున్న అంబుగైరికి దిగువున రాజపురం పైన చెక్ డాం నిర్మించి బుడంబో, భావనాపురం, కారిగాం మీదుగా బుడిగాటి నుండి కాలువ తవ్వి మందసలోని గోపాల సాగరానికి మళ్ళించాలన్నారు. గోపాలసాగరం, చీపి నుండి సాబకోట వరకూ ఉన్నటువంటి గెడ్డలు, కాలువలు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతినిధి బృందం పరిశీలించింది. సందర్భంగా వారు మాట్లాడుతూ వృధాగా పోతున్న నీటిని సాగు భూములకు మల్లి స్తే సుమారు 20 గ్రామాల్లోని 6000 ఎకరాలకు సాగునీరు అందించవచ్చున్నారు. గిరిజన గ్రామాలైన బలియా సాయి, బుడంబో, భావనాపురం, కారిగాం, మేఘమాల, లొడకపిట్ట తదితర గ్రామాలతో పాటు పల్లపు గ్రామాలైన మందస, బైరిసారంగపురం, రాధాకృష్ణ పురం, పితాతొలి, సిద్దిగాం, సొండిపూడి, బాలాజీపురం, ముకుందపురం, కొత్తపల్లి, అనంతపురం, శాసనం, పాత్రపురం, రాణిగాం, టి.శాసనం తదితర గ్రామాల భూములకు నీరు అందించవచ్చునన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ భూములకు సాగునీరు గ్యారెంటీ కల్పించే ఈ ప్రాజెక్టును పరిశీలించి అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారన్నారు. నిత్యము వర్షం పై ఆధారపడుతున్న ఈ గ్రామాలకు గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయర్ గా చేసి నీరు అందించాలన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఈ ప్రాజెక్టు రూపక ల్పనకు కృషి చేయాలని, ఈ ప్రాంత రైతులని ఆదు కోవాలని కోరారు. కార్యక్రమంలో కడమట కేశవ రావు, సిందిరి వల్లభ, అల్లాడ రాజులు, కోరాడ రమే ష, సవర లక్ష్మణరావు, సవర శ్యాము పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలను గుర్తించాలి

**- టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నాయుడు**



**పలాస, ఏప్రిల్ 9(వార్త):** పలాస మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలను గుర్తించా లని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ నాయుడు అన్నారు. బుధవారం పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ కార్యాలయములో టౌన్ ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురపాలక సంఘంలో గల అక్రమ కట్టడాలను గుర్తించి ఛార్జ్ షీట్లను ఫైల్ చేయవలసిందిగాను, ప్రభుత్వ భూములలో గల అక్రమ కట్టడాలను గుర్తించి వాటిని నిర్మూలించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమావేశంలో కమిషనర్ నడిపేన రామారావు మాట్లాడుతూ ఈ పురపాలక సంఘంలో ఉన్న టౌన్ ప్లానింగ్ కార్యదర్శిలను డిప్యూటేషన్ పై ఇతర శాఖలకు పంపించి ఉన్నందున మా కార్యాలయం సిబ్బంది కొరతగా ఉందని వారి డిప్యూటేషన్ను క్యాన్సిల్ చేసి ఈ పురపాలక సంఘంలో కొనసాగించుటకు ఆదేశంలు ఇవ్వవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టౌన్ ప్లానింగ్ అధికారి కృష్ణారావు, రీజనల్ కార్యాలయం విశాఖపట్నం డిప్యూటీ డైరెక్టర్లు శ్రావణి, సంతోష్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు, టౌన్ ప్లానింగ్ లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.

# క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి



**మెళియాపుట్టి, ఏప్రిల్ 9 (వార్త):** గ్రామంలో గుడి దగ్గరలోనున్న కాలువ గట్టుకి అనుసరించి ఉన్న పొలంలో క్రిమిసంహారక మందు (గులుకులు) తాగి జెరిభద్ర గ్రామానికి చెందిన దుంపల సూర్యరావు మృతి చెందినట్లు ఎస్సై రమేష్ బాబు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెలియాపుట్టి మండల పరిధిలో గల జెరిభద్ర గ్రామానికి చెందిన దుంపల సూర్యారావు ఆంజనేయస్వామి గుడికి దగ్గర్లో కంచరాన బృందావతి యొక్క పొలం వద్ద ఉన్న కాలువ గట్టు మీద మంగళవారం సాయంత్రం గులుకులు విషం తాగినట్లు, విషయం తెలిసిన వెంటనే తన తండ్రిని గ్రామస్తుల సహాయంతో ఆసుపత్రికి తీసుకుని వెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో మృతి చెందారని వారి కుమారుడు దుంపల అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమ సిబ్బంది ఆసుపత్రి వద్దకు మృతదేహాన్ని పరిశీలించి, శవపంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.



## అలలకు బోటు ధ్వంసం

**సంతబొమ్మాళి, ఏప్రిల్ 9(వార్త):** లక్ష్మీవలస పంచాయతీ గెద్దలపాడు తీర ప్రాంతంలో సముద్ర అలల ఉధృతకు బోటు ధ్వంసం అయి సుమారు 20 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. ఎప్పటిలాగే బుధవారం ఉదయం గెద్దలపాడు గ్రామానికి చెందిన మత్స్యకారులు సముద్రపు వేటకు బయలుదేరారు. తుఫాన్ కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో లంగరవేసిన బోట్లు ఏమవుతావని ఆందోళనతో మత్స్యకారులు తెప్పలపైన సముద్రంలోకి వెళ్లారు. బోటు కనిపించకపోవడంతో కొద్దిసేపు మత్స్యకారులు గాలించగా బోటు సముద్రంలో మునిగిపోయి ఉండడాన్ని గమనించి బోటును తీరం ఒడ్డుకు చేర్చడానికి కష్టపడ్డారు. అలలు ఉధృత వల్ల బోటు ధ్వంసమై వలలు చిరిగిపోయి సుమారు 20 లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని బాధిత మత్స్యకారుడు శ్రీరంగం వీరాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన బోటు, వలను ఫిషరీస్, రెవిన్యూ అధికారులతో పాటు మెరైన్ పోలీసులు పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.

## రైలు ప్రమాదంలో యువకుడి మృతి



**కోటబొమ్మాళి, ఏప్రిల్ 9(వార్త):** హరిశ్చంద్రపురం-తిలారు రైల్వే స్టేషన్ మధ్యలో బుధవారం జరిగిన రైలు ప్రమాధంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు 30 సంవత్సరాలు వయస్సుకలిగి, తెల్లని గల్లు షర్టు, నలుపు రంగు ఫ్యాట్ ధరించి చామనిచాయ రంగు కలిగి ఉన్నాడు. ఈ మేరకు పలాసా జీఆర్‌పీ హెచ్‌సీ డి. హరినాద్ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నాడు. మృతుని వివరాలు తెలిసిన యడల 8985021143 నెంబర్‌కు సంప్రదించాలని హరినాద్ కోరారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తం



**మందస, ఏప్రిల్ 9(వార్త):** సైబర్ మోసాలపై అప్రమత్తతే శ్రీరామరక్షని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలంలోని హరిపురం-బాలిగాం జంక్షన్లో సైబర్ మోసాలపై ప్రజలకు అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుర్తింపులేని ఫోన్ నంబర్లు వస్తే, ఫోన్కాల్స్ ఎత్తకపోవడమే ఉత్తమమన్నారు. ఆధార్, బ్యాంక్ అక్కౌంట్లు అప్డేట్ పేరిట ఫోన్కాల్స్ వస్తే ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దన్నారు. ఏటీఎంల పిన్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని, వారి మాయలో పడవద్దని సూచించారు. ఏటీఎం కేంద్రాల వద్ద నగదు తీయడానికి తెలియని వ్యక్తులకు కార్డులు ఇవ్వవద్దన్నారు. వేర్వేరు ఫోన్ నంబర్లుతో మోసగాళ్లు ఫోన్ చేస్తుంటారని, బ్యాంక్ అక్కౌంట్, ఫోన్, గూగుల్పే తదితర విషయాలను తెలుసుకోవడానికి, ఖాతాలను ఖాళీ చేయడానికి నానా ప్రయత్నాలు చేస్తుంటారన్నారు. వీటికి స్పందించవద్దని కోరారు. ఆయనతో పాటు కానిస్టేబుల్ కె. ఢిల్లేశ్వరరావు, పోలీసు స్టేషన్ సిబ్బంది కూడా ఉన్నారు.

## మజ్జిగ వితరణ

**పలాస, ఏప్రిల్ 9 (వార్త) :** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కాలేజీ ఆవరణలో పట్టణ రహదారిలో బాటసారులకు దాహార్తిని తీర్చే మజ్జిక పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇది ఒక గొప్ప కార్యక్రమం అని, కాలేజీ చేపడుతున్న కార్యక్రమములలో ఇది ఒక మంచి మరి పరిణామణి కొనియాడారు. ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న తరుణంలో ఏప్రిల్ నెల అంతా ప్రతి బుధవారం దీన్ని కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం జాతీయ సేవా కార్యక్రమం విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ పి మధు,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పి వెంకటరమణ, ఐక్యూఏసి కోఆర్డినేటర్ ఎల్ గణపతరావు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పట్నాయక్, కామర్స్ అధ్యాపకులు లైబ్రేరియన్ బి నరసింహులు, ఇతర అధ్యాపకులు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546